క్లుప్తంగా

ముగిసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం



చిన్నారులకు సర్టిఫికెట్లు, బ్యాగ్‌లు అందజేసిన దృశ్యం

సనత్‌నగర్: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్ సమీపంలోని రాజయోగా మెడిటేషన్ సెంటర్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. 7–14 సంవత్సరాల వయస్సున్న చిన్నారులకు వ్యాయామా కసరత్తు, పరీక్షల భయం ఏ విధంగా అధిగమించాలి, సులభతరమైన మెడిటేషన్ విధానం, స్ఫూర్తిదాయక కథలు, మెదడుకు పదునుపెట్టే వినోదాత్మక గేమ్స్, పేపర్ క్రాఫ్ట్స్, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. అదే విధంగా ప్రత్యేక మెడిటేషన్ తరగతులు నిర్వహించి మెడిటేషన్ ప్రాముఖ్యం గురించి వివరించారు. ఈ శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్స్‌తో పాటు బ్యాగ్‌లను అందజేశారు. కార్యక్రమంలో రాజయోగా కేంద్రం ఇన్‌చార్జిలు బ్రహ్మకుమారీస్ కల్పన, విద్య పాల్గొన్నారు.

'ఆర్య సమాజ్'లో ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న స్వామి దేవవ్రత సరస్వతి

ఉస్మానియా యూనివర్సిటీ: సికింద్రాబాద్ డివిజన్‌లోని మేడిబావి వ్యాస్‌నగర్ ఆర్య సమాజ మందిరంలో ఈ నెల 22 నుంచి 30 వరకు జరిగిన శిక్షణ కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ఆర్యవీర్‌దళ్ డైరెక్టర్, ఓయూ అధ్యాపకులు డాక్టర్ ధర్మతేజ అధ్యక్షత వహించగా జాతీయ అధ్యక్షులు స్వామి దేవవ్రత సరస్వతి ముఖ్య అతిథిగా హాజరై ఆర్యవీర్‌దళ్ విశిష్టత గురించి వివరించారు. దేశభక్తి, పితృభక్తి, దైవభక్తితో పాటు కరాటే, కర్రసాము, యోగా తదితర అంశాలలో 200 మంది యువకులకు 9 రోజుల శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అందులో అత్యంత ప్రతిభ కనబరచిన 15 మందిని జూన్ 1 నుంచి 15 వరకు హరియాణలోని రోతక్ జిల్లాలో జరిగే శిక్షణకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ రవీందర్, శ్రీనివాస్, జయరాజ్, ధర్మపాల్, యశ్వంత్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

వ్యాపారిని మోసం చేసిన వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: మార్బుల్ కావాలని ఫోన్ చేసిన ఓ వ్యక్తి వ్యాపారి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు దండుకున్న ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వెంగళరావునగర్‌కు చెందిన శ్రీరాం కల్యాణ్‌కుమార్ మార్బుల్ వ్యాపారి. మార్బుల్ కావాలని ఓ వ్యక్తి ఫోన్ చేసి చేయగా రూ.20 వేలు అడ్వాన్సు కావాలని అడగడంతో క్యూఆర్ కోడ్ పంపాలని సదరు వ్యక్తి చెప్పడంతో వాట్సాప్‌లో కోడ్ పంపించాడు. దానిని స్కాన్ చేసి యూపీఐ ఐడీ చెప్పించుకుని వ్యాపారి అకౌంట్‌లో నుంచి రూ.41 వేలు దండుకున్నాడు. మోసపోయినట్లు గ్రహించిన కల్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

సహజీవనంపై స్పష్టత ఇవ్వాలి

ప్రొ.గాలి వినోద్‌కుమార్

లాలాపేట: సహజీవనం అనే విషయంపై సుప్రీం కోర్టు స్పష్టత ఇవ్వాలని ఓయూ లా కళాశాల డీన్, ప్రొ. గాలి వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వలింగ వివాహాలపై సుప్రీం కోర్టు విచారిస్తున్న నేపథ్యం 120 మంది మేధావి వర్గం ప్రకృతి విరుద్ధమైన ఈ వివాహాలను కోర్టు అనుమతించకూడదని వారి అభిప్రాయాన్ని వెలిబుచ్చారని, కొన్ని వేల సంవత్సరాల క్రితం పురుష సూక్తం పేరుతో బ్రహ్మ తల నుంచి బ్రాహ్మణులు, భుజాల నుంచి క్షత్రీయులు, ఉదరం నుంచి వైశ్యులు, పాదాల నుంచి శూద్రులు పుట్టారని చెప్పన్న ఈ అశాస్త్రీయమైన జనన సిద్ధాంతాన్ని సైతం ఆ మేధావి వర్గం విమర్శించి ఉంటే స్వాగతించేవాళ్లమన్నారు.

దీవించమ్మా



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో ఆదివారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం నూతన సచివాలయంలో మంత్రి చాంబర్‌లోకి వెళ్లనుండటంతో ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. -రాంగోపాల్‌పేట్

పూర్తయి పదేళ్లు.. కేటాయింపునకు ఇంకెన్నాళ్లో?

- ఆక్రమణలో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లు
- రాజకీయ నేతలకు కాసులు కురిపిస్తున్న వైనం
- ఏళ్ల తరబడి ఎదురు చూపులే
- బేగంపేట ఓల్డ్ పాటిగడ్డ, ఎన్‌బీటీనగర్‌లోనూ ఇదే దుస్థితి



బేగంపేట్ ఓల్డ్ పాటిగడ్డలో నిర్మించిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్ల సముదాయం

సనత్‌నగర్: నిరు పేదల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఇళ్లు పాలకుల తీరును వెక్కిరిస్తున్నాయి. నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు అందించాలన్న చిత్తశుద్ధి మాత్రం కానరావడం లేదు. ఎన్నో ఏళ్లుగా ఇదే విధమైన వ్యవహారం కొనసాగుతుండడం సొంత ఇంటి కల కల్లగానే మిగిలిపోతోంది. బేగంపేట్ ఓల్డ్ పాటిగడ్డలో 2007 డిసెంబర్‌లో మొత్తం 193 మందికి జవహర్‌లాల్‌నెహ్రూ నేషనల్ అర్బన్ రెనెవల్ మిషన్ (జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం) కింద ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 2009 వరకు పనులు వేగవంతంగానే జరిగాయి. ఆ తరువాత కాంట్రాక్టర్ నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం సదరు కాంట్రాక్టర్‌ను తప్పించి మరో కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారు. ఆ తర్వాత రెండేళ్ల మొత్తం 193కు 176 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇళ్ల నిర్మాణం జరిగి పదేళ్లు గడిచినా లబ్ధిదారులకు మాత్రం అప్పగించలేదు. పైగా ఆయా ఇళ్లకు మౌలిక వసతులైన కరెంట్, డ్రైనేజీ, మంచినీరు వసతులు కూడా కల్పించకుండా ఈ నాలుగేళ్లుగా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఇదిలా ఉంటే అటు లబ్ధిదారులకు అందకుండా ఉన్న ఈ ఇళ్ల నిర్వహణ కూడా ఎవరూ చేపట్టకపోవడంతో అధ్వానస్థితికి చేరాయి. కొన్ని బ్లాక్‌లలో ఇళ్ల కిటికీలను గుర్తుతెలియని అగంతకులు పగులగొట్టారు. పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌బీటీనగర్‌లోనూ ఇలాగే..

బేగంపేట్ ఎన్‌బీటీనగర్‌లో జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కింద జీ ప్లస్ 3 విధానంలో 64 ఇళ్లను రూ.2.18 కోట్లతో నిర్మించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.09 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.44 లక్షలు, లబ్ధిదారుల వాటా కింద బ్యాంక్ లోన్స్ ద్వారా రూ.65 లక్షలు వెచ్చించి నిర్మాణాలను పూర్తి చేశారు. 2008లో ప్రారంభించిన నిర్మాణాలు ఎట్టకేలకు ఈ ఏడాది పూర్తి చేశారు. అయితే ఇక్కడ కూడా కనీస వసతులు కల్పించాల్సి ఉంది. ఎప్పుడు కనీస వసతులు కల్పిస్తారో.. లబ్ధిదారులకు ఎప్పుడిస్తారో అని ఎదురు చూస్తూనే ఉన్నారు.

ఇష్టానుసారంగా ఆక్రమణలు..

అటు అధికారికంగా కేటాయింపుల ప్రక్రియ జరగకపోవడంతో ఎవరికి వారే ఆక్రమించుకుని ఉంటున్నారు. ఈ ఇళ్లు కొంతమంది రాజకీయ నాయకులకు కాసుల వర్షం కురిపిస్తుండడం గమనార్హం. రాజకీయ పలుకుబడితో కొంతమంది ఆక్రమించుకుని ఇతరులకు అద్దెలకు కూడా ఇస్తుండడం మరో వింత. ఇటీవల రెవెన్యూ అధికారులు పలు ఇళ్లకు తాళాలు వేసి సీజ్ చేసినప్పటికీ పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పు లేదంటే ఇక్కడి నాయకుల పలుకుబడి ఎలా అర్థం చేసుకోవచ్చని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్వవిద్యార్థుల సహకారం నూతనత్వం

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాలరావు



సీఎండీ గోపాల్‌రావును సన్మానిస్తున్న ఓయూ వీసీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ పూర్వవిద్యార్థుల సహకారంతో కళాశాలకు నూతనత్వం సంతరించుకుంటుందని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాలరావు అన్నారు. ఆదివారం పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అలుమ్నీ మీట్–2023 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంజినీరింగ్ కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సహకారం అందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. దేశ, విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు గత కొని ఏళ్లుగా అనేక విధాలుగా సహాయం చేస్తున్నారని ఇటీవల కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి కాలరీస్ అధికారులు ఓయూ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.3 కోట్ల ఆర్థిక సాయం, ఈసీఈ విభాగంలో తరగతి గదుల కాంప్లెక్స్ నిర్మిస్తున్నారని అలుమ్నీ అధ్యక్షులు డాక్టర్. విజయ్‌కుమార్ వివరించారు. ఓయూ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో పోటీపడేలా పూర్వవిద్యార్థుల తమ ఉపన్యాసాలతో విజ్ఞానాన్ని అందించాలని వీసీ ప్రొ.రవీందర్ కోరారు. గత ఏడేళ్లుగా పూర్వ విద్యార్థులు ఇంజినీరింగ్ కాలేజీ అభివృద్ధి చేస్తున్న కృషిని ఓయూ మాజీ వీసీ ప్రొ.రాంచంద్రం అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, అలుమ్నీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎంఎస్.వెంకట రామయ్య, సింగరేణి కాలరీస్ ఆపరేషన్ విభాగం డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.



రిలే దీక్షను ప్రారంభిస్తున్న ఆలకుంట హరి

26వ రోజుకు చేరిన రిలే దీక్ష

లాలాపేట: తమ బస్తీలో హాస్పిటల్ ఏర్పాటు చేయాలని మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారంతో 26వ రోజుకు చేరుకుంది. బస్తీ వాసులు ఆందోళనకు మద్దతుగా ఆదివారం ఓయూ క్యాంపస్‌లోని 9 బస్తీలకు చెందిన గుడిసెవాసుల సంక్షేమ సంఘం నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ గ్రేటర్ అధ్యక్షుడు ఆలకుంట హరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు స్పందించి హాస్పిటల్ కోసం స్థలాన్ని కేటాయించాలని కోరారు. దీక్షలో ఎండీ ఖాజా, యాఖూబ్, ఆనంద్, ముజీద్, శ్రీనివాస్, అక్బర్, మక్బూల్, రామకృష్ణ, శంకర్, ఆర్. శ్రీను, అలీ, గౌస్, చాద్ భాయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుతా



మాట్లాడుతున్న క్రిశాంక్

కంటోన్మెంట్: బస్తీల్లో సమస్యలు పరిష్కారం అయ్యేదాకా పోరాడుతూనే ఉంటానని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన బస్తీ నిద్ర ఆదివారం కంటోన్మెంట్ 108 బజార్‌లో కొనసాగింది. శనివారం రాత్రి బస్తీలో నిద్రించి, ఆదివారం ఉదయం స్థానికులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్తీలోనికి వెళ్లే మార్గాలను మూసేస్తూ మిలటరీ అధికారులు ప్రహరీలు కట్టడం దారుణమన్నారు. 108 బజార్ వాసులకు బోర్డు ఎన్నికల్లో ఓట్ల పునరుద్ధరణకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు. అనంతరం రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు బస్తీవాసులతో కలిసి లేఖ రాశారు. ఈ కార్యక్రమంలో మోతీ దాస్, రాజు, విక్రమ్ సింగ్, సుధాకర్, మోని, రఘు, సాయి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక లాభాలంటూ బురిడీ

రాణాలకు బాధితుల పరుగులు

అమీర్‌పేట: పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలో భారీగా డబ్బులు సంపాదించవచ్చని ఇన్‌స్టాగామ్, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చిన ప్రకటనలు నమ్మి 8 మంది మోసపోయి ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. బీకేగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి సాయి లక్ష్మణ్, బోరబండ వివేకానందనగర్ నివాసి వి.నవీన్, ఎల్లారెడ్డిగూడ కీర్తి అపార్ట్‌మెంట్‌లో ఉండే సురేంద్రకుమార్, బోరబండ ఫేజ్–3లోని శ్రీనిలయం అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న రాజ్‌కుమార్, అమీర్‌పేట ఓ హాస్టల్‌లో ఉండే సాంబశివ, ఎల్లారెడ్డిగూడకు చెందిన సాయినిఖిత, ఇదే ప్రాంతంలోని అలీనగర్ హాస్టల్‌లో ఉండే విద్యార్థి భరత్‌రెడ్డి, మధురానగర్‌లో ఉంటున్న ప్రవీణ్‌చౌదరీ ప్రకటనలు నమ్మి డబ్బులు పెట్టారు. ఒకొక్కరు రూ.20 వేల నుంచి రూ.90 వేల వరకు డబ్బులు చెల్లించి నెలలు గడుస్తున్నా వారికి డబ్బులు రాకపోవడంతో ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సైదులు తెలిపారు.

అకౌంట్ బ్లాక్ అయ్యిందని..

మోతీనగర్ స్నేహపూరి కాలనీలో ఉండే అనిల్‌కు బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయిందని, పునరుద్ధరించాలంటే పాన్ కార్డు నెంబర్ ఎంటర్ చేయాలని ఓ లింక్ వచ్చింది. నిజమని నమ్మిన అనీల్ దానిపై క్లిక్ చేసి ఓటీపీ ఎంటర్ చేయగానే అతడి అకౌంట్‌లో నుంచి రూ.98 వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావడంతో పోలీసులను ఆశ్రయించాడు.

పద్మశాలి న్యాయవాదులు సంఘటితం కావాలి



డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కంటోన్మెంట్: పద్మశాలి న్యాయవాదులు సంఘటితం అవుతూ పరస్పరం సహకరించుకోవడం అభినందనీయమని రాష్ట్ర హైకోర్టు అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ అన్నారు. వెస్ట్‌మారేడుపల్లిలోని పద్మశాలి కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రజతోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఇటీవల పద్మశాలి న్యాయవాదుల సంఖ్య పెరుగుతోందని పద్మశాలి న్యాయవాదులు సంఘటితంగా ఉంటూ రాజకీయ రంగంలోనూ రాణిస్తే వెనుకబడిన వర్గాలకు చేయూత అందించే అవకాశం ఉంటుందన్నారు. నూతన అధ్యక్షులుగా నియమితులైన నామాల ఆశోక్ కుమార్‌కు మాజీ అధ్యక్షులు రాపోలు సత్యనారాయణ బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ భోగ నీరజ ప్రభాకర్, మాచర్ల రంగయ్య, శివానంద్, రవీందర్, వెంకటేశ్వర్లు, లక్ష్మీ నారాయణ, వేణుగోపాల్, శ్రీరామ్ శివజ్యోతి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ ఫేజ్–3లో చైన్ స్నాచింగ్

అమీర్‌పేట: పాలు తీసుకొచ్చేందుకు వెళ్లిన వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును ఓ అగంతకుడు లాక్కుని పారిపోయిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కళ్యాణ్‌నగర్ ఫేజ్–3లోని హిమగిరి టవర్స్ 3వ అంతస్తులో ఉంటున్న పి.కళ్యాణి ఆదివారం ఉదయం 6.15 గంటల సమయంలో పాలు తీసుకుని అపార్ట్‌మెంట్ లిఫ్ట్ వద్ద నిలబడింది. ఇదే సమయంలో అక్కడికి వచ్చిన ఓ అగంతకుడు ఆమె మెడలోని రెండున్నర తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పార్కింగ్ చేసిన వాహనానికి నిప్పు

అమీర్‌పేట: ఇంటి బయట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని తగులబెట్టిన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోరబండలో జరిగింది. సాయిబాబానగర్ ఎన్‌ఆర్‌ఆర్‌పురానికి చెందిన బత్తుల కుటుంబరావు కారు డ్రైవర్. శనివారం రాత్రి డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట నిలిపాడు. అర్ధరాత్రి వాహనం మంటల్లో కాలుతున్న గుర్తించిన స్థానికుడు తిమప్ప ఫోన్ చేసి విషయం తెలిపాడు. స్థానికులతో కలిసి మంటలు ఆర్పేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి సాయిప్రకాష్ అనే వ్యక్తి తగులపెట్టినట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

అమీర్‌పేట: బల్కంపేట లింగయ్యనగర్‌లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు శనివారం రాత్రి ఇంట్లో దాడులు చేసిన పోలీసులు పేకాట ఆడుతున్న కోటేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, మహేందర్, షేక్ అజ్రత్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.86 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

'విశ్వాసా'నికి నివాళి



కుక్క చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అమీర్‌పేట: అపురూపంగా పెంచుకున్న కుక్క చనిపోతే ఆ కుటుంబం బరువెక్కిన హృదయాలతో కుక్కకు ఖననం చేయడమే కాకుండా దానికి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియాలు నిర్వహించి తమ అనుబంధాన్ని చాటుకున్నారు. ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన కొత్తపల్లి మధుసూధన్‌రావు–విజయలక్ష్మి దంపతులు మినీచర్ పించర్ జాతికి చెందిన కుక్కను 17 ఏళ్ల క్రితం ఇంటికి తెచ్చుకుని దానికి స్కాంపీ అని పేరు పెట్టుకున్నారు. రెండు నెలల నుంచి అనారోగ్యంగా ఉంటున్న దాన్ని చికిత్స చేయించినా చనిపోయింది. ఆదివారం అంత్యక్రియలు నిర్వహించి సంస్మరణార్థం కొత్తపల్లి దంపతులు ఆదివారం తమ నివాసంలో భోజనాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా కేంద్రీయ విద్యాలయ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలచేస్తున్న బ్రిగేడియర్ సురేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ బొల్లారంలోని కేంద్రీయ విద్యాలయ వార్షిక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా బ్రిగేడియర్ సురేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అనంతరం విద్య, క్రీడా, సాంస్కృతిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బ్రిగేడియర్ సురేష్ బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్య అభివృద్ధి, పురోగతికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వీణా అనిల్ రోటీ, వైస్ ప్రిన్సిపల్ హర్జీత్ కౌర్ పాల్గొన్నారు.

హమ్మయ్య రోడ్డు తెరిచారు



మిఠాయిలు తినిపించుకుంటున్న స్థానికులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రక్షణ శాఖ అధికారులు బొల్లారం లక్డావాలా వద్ద మూసేసిన రోడ్డును తెరవడంతో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జైప్రకాష్ ఆధ్వర్యంలో ఆనందం వ్యక్తపరుస్తూ మిఠాయిలు తినిపించుకున్నారు. గత కొన్నెళ్ల నుంచి అధికారులు భద్రత సాకుతో రోడ్డును మూసివేశారు. ఇటీవల రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల అధికారులు ఆదివారం తెరిచారు. దీంతో బొల్లారం నుంచి యాప్రాల్, జవహర్‌నగర్, బాలాజీనగర్, చెన్నపురం, గబ్బిలాలపేట, అంబేడ్కర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జైప్రకాష్ తెలిపారు. తమ సుదీర్ఘ పోరాటానికి ఫలితం దక్కిందని అన్నారు. రోడ్డు తెరవడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు కూడా ప్రారంభం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ జవహర్, బాలరాజు, శ్రీనివాస్ గౌడ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న బ్రిగేడియర్ సోమ శంకర్

రసూల్‌పురా: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు మానసిక వికాసానికి ఎంతో దోహదపడుతాయని తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా కమాండర్, కంటోన్మెంట్ బ్రిగేడియర్ సోమశంకర్ అన్నారు. ఖేలో ఇండియా కార్యక్రమంలో భాగంగా మడ్‌ఫోర్ట్ క్రీడా మైదానంలో కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను బోర్డు సీఈవో మధుకర్ నాయక్, బోర్డు నామినేటెడ్ సభ్యులు జే .రామకృష్ణతో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు పంపించాలని క్రీడల్లో శిక్షణ ఇప్పించి క్రీడల పట్ల ఆసక్తి కలిగించే విధంగా కృషి చేయాలని సూచించారు. సీఈవో మధుకర్ నాయక్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో క్రీడలను ప్రోత్సాహించే విధంగా తాము తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వేసవి శిక్షణ శిబిరాలే కాకుండా నిరంతరం క్రీడల పట్ల తగిన శిక్షణ అందించేందుకు కృషి చేస్తామన్నారు. బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని మడ్‌ఫోర్ట్, తిరుమలగిరి, బొల్లారంల్లోని క్రీడా మైదానాల్లో వాలీబాల్, క్రికెట్, మార్షల్ ఆర్ట్స్, ఫుట్‌బాల్ క్రీడల్లో జూన్ 14వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీవో మాజీ కార్యదర్శి జాన్ మనోజ్, బ్యాడ్మింటన్ కోచ్ నాగరాజు, రైల్వేస్ కోచ్ సువర్ణ, క్రికెట్ కోచ్ దయానంద్, వాలీబాల్ కోచ్ జనార్ధన్, సిని, టీవి నటి పూజ శ్రేయష్, రెజ్లింగ్ కోచ్ సాయిబాబా యాదవ్, కంటోన్మెంట్ కార్యాలయ సూపరింటెండెంట్ అక్బర్ అలీ, బోర్డు శానిటేషన్ ఉన్నతాధికారులు దేవేందర్, మహేందర్ పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు



పూజలో పాల్గొన్న బండా చంద్రారెడ్డి



హోమాలు చేస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: అడ్డగుట్ట సీ–సెక్షన్‌లోని విశ్వకర్మ భగవాన్ ఆలయంలో ఆదివారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. విశ్వకర్మ కుటుంబ సభ్యులు దంపతులుగా పూజ మహోత్సవాల్లో పాల్గొని యజ్ఞం, హోమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దశరథ చారి, చిత్తం చారి, సత్యనారాయణ చారి, రామ్ నివారి, నాగేష్ చారి, శ్రీధర్ పాల్గొన్నారు.

విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ..

లాలాపేట: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లాలాపేటలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 330వ ఆరాధనా మహోత్సవాలు ఘనంగా జరిగాయి. పండితులు సదానందాచార్యుల సమక్షంలో కాలజ్ఞానం పఠనం, హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

స్ఫూర్తి నింపేలా 'మన్‌కీ బాత్'



మన్ కీ బాత్‌లో పాల్గొన్న నాయకులు



మోదీ ప్రసంగాన్ని వింటున్న బీజేపీ నాయకులు

అడ్డగుట్ట: దేశ ప్రజలకు స్ఫూర్తి నింపేలా ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' ఉందని బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్ అన్నారు. ప్రధాని మోదీ 100వ మన్‌కీబాత్ కార్యక్రమానికి పురస్కరించుకొని ఆదివారం ఆయన నివాసంలో శక్తి కేంద్రం సభ్యులతో కలిసి వీక్షించారు. ప్రజలకు ఎంతో ఉపయోగపడటమే కాకుండా సమాజంలో ఎన్నో మార్పులకు దోహదపడే విధంగా ఈ కార్యక్రమం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సాయన్న, మక్కల బాబు, లోకేష్, శ్యామల, శ్రీధర్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌లో బీజేపీ శ్రేణులు

సనత్‌నగర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ సందర్భంగా సనత్‌నగర్‌లోని మాతృశ్రీ స్టడీ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు. ఓబీసీ మోర్చా సనత్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి చంద్రకుమార్, సనత్‌నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సిర్మనీ నరేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మోదీ సందేశాన్ని ఆలకించారు. అదే విధంగా బీకేగూడ జైభారతి హైస్కూల్ చౌరస్తాలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీనియర్ నేతలు బాల నరసింహ, సుమన్‌కుమార్, కుషల్‌కుమార్, శ్రవణ్‌కుమార్, శివకుమార్, సతీష్, రాజేష్, కిరణ్, ఆనంద్ పాల్గొన్నారు.

మాజీ మేయర్ నివాసంలో..

లాలాపేట: నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఆదివారం తార్నాకలోని మాజీ మేయర్ బండా కార్తీకచంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లాలాపేట, తార్నాకకు చెందిన పలువురు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో కలిసి బీజేపీ నేత బండా చంద్రారెడ్డి ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు స్ఫూర్తి నిచ్చేలా సందేశమిచ్చారన్నారు. మన్ కీ బాత్ ద్వారా దేశంలో అసమాన్య సేవలు అందిస్తున్న వారి గురించి దేశ ప్రజలకు తెలిసే అవకాశం లభిస్తుందన్నారు.

బూత్ నెం.100లో వందో ఎపిసోడ్.

కంటోన్మెంట్: ప్రధాని మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను ఆదివారం బోర్డు సభ్యుడు రామకృష్ణ, సామల సత్తిరెడ్డి, కార్యకర్తలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీ చేపట్టిన మన్ కీ బాత్ దేశ వ్యాప్తంగా అనేక సమస్యలు, విజయాలు, విజన్ ప్రస్తావనకు వేదిక అయిందన్నారు. సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన మన్ కీ బాత్ అత్యంత ప్రజాదరణ పొందిన కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో శ్రీను, లక్ష్మణ్, కుమార్, ఇందిర, రజనీ, శకుంతల, రాజు, అరుణ్ విజయ్ పాల్గొన్నారు.